క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 22న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర ప్రాంతంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, లష్కర్ బజార్ మెయిన్‌రోడ్‌లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, లోటస్ కాలనీ, మైత్రివనం, విల్లాస్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, కాజీపేట భవాని నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ అడ్మిషన్లు

వరంగల్: ఓపెన్ స్కూల్ నేతృత్వంలో నిర్వహిస్తున్న వరంగల్ క్రిస్టియన్ కాలనీ యూనిక్ హైస్కూల్ అధ్యయన కేంద్రంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో దరఖాస్తులు చేసుకోవాలని స్కూల్ కోఆర్డినేటర్ సమి ఉల్లాబేగ్ తెలిపారు. సెప్టెంబర్ 10 లోపు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రెగ్యులర్ పాఠశాలలో చేరని వారికి ఈ అవకాశం ఉంటుందన్నారు. 73961 35390 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మండల స్థాయి క్రీడా శాఖలను ఏర్పాటు చేయాలి

కాశిబుగ్గ: వరంగల్ జిల్లాలోని 13 మండలాల మండల స్థాయి క్రీడాశాఖలను ఏర్పాటు చేయాలని జిల్లా యువజన క్రీడల అధికారిణి సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాల అభివృద్ధి అధికారులు(ఎంపీడీఓ)లు ఆగస్టు 28 లోపు కమిటీ సభ్యుల వివరాలను జిల్లా యువజన, క్రీడా కార్యాలయంకు పంపించాలన్నారు. కమిటీ వివరాలను జత చేసి పంపించాలన్నారు.

దర్గా ఉత్సవాల పనుల పరిశీలన


కాజీపేట రూరల్ : కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా ఉర్సు ఉత్సవాలకు సంబంధించి చేపట్టబోయే అభివృద్ధి పనుల పరిశీలన కోసం జిల్లా అధికారులు బుధవారం దర్గాకు చేరుకున్నారు. ఈ నెల 31 నుంచి నాలుగు రోజుల పాటు ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు, చేపట్టే అభివృద్ధి పనుల నేపథ్యంలో భాగంగా ఆర్డీఓ వెంకటేష్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర విభాగాల జిల్లా అధికారులు చేరుకొని తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్, దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషాతో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో బోడగుట్ట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జెరుషా సృజన, ఎలక్ట్రిక్ ఏఈ శ్రీధర్, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, అధికారులు పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్టులకు సన్మానం



నయీంనగర్: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫొటో జర్నలిస్టులుగా అవార్డులు పొందిన జర్నలిస్టులను గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ కమిటీ ఘనంగా సన్మానించింది. బుధవారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టులు గోకారపు శ్యాంకుమార్, వీరగోని హరీష్, చేతి శ్రీనివాస్, కుడుతాల రమేశ్, మేరుగు ప్రతాప్‌ను క్లబ్ కార్యవర్గం శాలువా కప్పి, మెమోంటోలు ఇచ్చి సన్మానించింది. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఏడీని కలిసిన టీజీఓ నాయకులు




ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇస్మాయిల్‌ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పరిపాలన అనుభవం ఉన్న ఇస్మాయిల్ ఎంజీఎం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. టీజీఓ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్‌కె హసన్, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు సతీష్‌రెడ్డి, లతీఫ్‌బాయ్, పి.రాధాకృష్ణ ఉన్నారు.

సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన

హసన్‌పర్తి : సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తీజ్ ఉత్సవాల్లో భాగంగా 56వ డి విజన్‌లో బుధవారం సంత్ రమేష్ గురూజీ మహరాజ్ చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ పాల్గొన్నారు. కేయూ ప్రిన్సిపాల్ సురేష్ లాల్, కార్పొరేటర్ సునీల్‌కుమార్, లంబాడ లైవ్ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రాజునాయక్ ఉన్నారు.

అభివృద్ధికి నోచుకోని సుర్జీత్‌నగర్

- ఇబ్బందుల్లో 500 కుటుంబాలు
- రూ.80 లక్షల నిధులు దారి మళ్లింపు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



న్యూశాయంపేటలోని సుర్జీత్‌నగర్ కాలనీ



బురదమయమైన రోడ్లు

కాజీపేట అర్బన్ : మండలంలోని న్యూశాయంపేట సుర్జీత్‌నగర్ కాలనీ అభివృద్ధికి నోచుకోక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం న్యూశాయంపేటలో ఏర్పడిన సుర్జీత్ నగర్‌లో 500 కుటుంబాలను నివసిస్తున్నాయి. వీరిని ఓటు బ్యాంకుగా రాజకీయ పార్టీలు ఉపయోగించుకుంటూ ఎన్నికల్లో కాలం గడుపుతూ ఎన్నికల తర్వాత మావైపు చూసే నాథుడే లేడంటున్నారు కాలనీవాసులు. ప్రభుత్వాలు మారుతున్నా మా తలరాత మారడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు మాపై దృష్టిసారించి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాల కోసం ఎదురుచూపులు

20 ఏళ్లుగా సుర్జీత్‌నగర్‌లో నివాసం ఉంటున్న సుమారు 500 కుటుంబాలు కనీస సౌకర్యాల కోసం ఎదురుచూస్తున్నాయి. సైడ్ డ్రెయిన్స్ లేక ఇళ్లలోకి మురుగునీరు ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లి అనారోగ్యాల బారిన పడుతున్నారు. సరైన రోడ్లు లేక వర్షాకాలంలో వర్షం పడితే చాలు బురదమయమైన రోడ్లపై ప్రయాణం కొనసాగించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ. 80 లక్షల నిధులు దారి మళ్లింపు

నాడు మేయర్‌గా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఉన్న సమయంలో సుర్జీత్‌నగర్‌కు రూ.80 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు కాలనీలో మీటింగ్‌ను ఏర్పాటు చేసి హామీ ఇచ్చారు. కాగా కాలక్రమేణా ఆ నిధులు దారి మళ్లించి వేరే కాలనీలను అభివృద్ధి చేశారే తప్ప మాకు ఒరిగిందేమిలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని విధాలా అభివృద్ధి చేయాలి



31వ డివిజన్‌లోని సుర్జీత్‌నగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలి. సైడ్ డ్రెయిన్స్, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలి. 20 ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. సుర్జీత్‌నగర్ కాలనీని గుర్తించి అభివృద్ధి చేయాలి.

– కారు ఉపేందర్, సుర్జీత్‌నగర్, వ్యవస్థాపకుడు

కామాంధులను బహిరంగంగా శిక్షించాలి



వరంగల్ అర్బన్ : బల్దియా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సంఘాల నాయకులు



విద్యారణ్యపురి : కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు

వరంగల్ అర్బన్ : కోల్‌కతా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి, హత్య చేసిన కామాంధులను బహిరంగంగా శిక్షించాలని బల్దియా ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఉద్యోగులు, కార్మికులు నిరసన వ్యక్తం చేసి, ఎంజీఎం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ధర్మరాజు, టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, భాస్కర్, సారంగపాణి పాల్గొన్నారు.

విద్యారణ్యపురి: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ మాట్లాడారు. కాళోజి విగ్రహం నుంచి కొవ్వత్తుల ర్యాలీ అమరవీరుల స్తూపం వరకు కొనసాగింది. టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రవీందర్‌రాజు, రాజు, పాల్గొన్నారు.

ఖిలావరంగల్: వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గున్నాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం వరంగల్ కరీమాబాద్ రోడ్డుపై సీఐటీయూ ఏరియా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

క్రైం కార్నర్

చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

హసన్‌పర్తి: హసన్‌పర్తి పెద్ద చెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. రెండు రోజుల క్రితమే చెరువులో పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు 50 ఏళ్ల వయసు కలిగి, బట్టతల, తెలుపుగడ్డం కలిగి ఉన్నాడని పోలీసులు చెప్పారు. 87126 85124, 87126 85097 నంబర్లను సంప్రదించాలని ఎస్సై దేవేందర్ తెలిపారు. కాగా, ఈఘటనపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్యా? ఆత్మహత్యా ? ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడా అని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

గంజాయి స్వాధీనం

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీసులు సుమారు రూ.1.16 లక్షల (4.6కిలోల) గంజాయిని పట్టుకున్నారు. ఒకరు అరెస్ట్ కాగా మరొకరు పరారీలో ఉన్నట్లు సీఐ సంజీవ తెలిపారు. వివరాలను బుధవారం వెల్లడించారు. విధుల్లో భాగంగా స్థానిక ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో చింతగట్టు క్యాంప్ ప్రాంతంలో మంగవారం రాత్రి గస్తీ నిర్వహిస్తున్న క్రమంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద 4.6 కిలోల విలువైన గంజాయి లభ్యమమైనట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. జగిత్యాలకు చెందిన ససాల మణికంఠ విచారణలో తేలినట్లు చెప్పారు.

భద్రాచలం టు జగిత్యాల వ్యాపారం

జగిత్యాలకు చెందిన కాసాని మణికంఠ, మారంపల్లి జాక్‌లు ఇద్దరు కలిసి భద్రాచలం నుంచి కొనుగోలు చేసి జగిత్యాల, కరీంనగర్, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. వీటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విద్యార్థులకు అమ్ముతున్నారని సీఐ వివరించారు. మంగళవారం భద్రాచలం నుంచి గంజాయిని కొనుగోలు చేసి జగిత్యాలకు తీసుకెళ్తున్న క్రమంలో మణికంఠ పోలీసులకు చిక్కాడు. మణికంఠను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. మారంపల్లి జాక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సంజీవ మాట్లాడుతూ గంజాయి అమ్మకందారులపై ఉక్కుపాదం మోపినట్లు చెప్పారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తూ, ఖరీదు చేస్తూ పట్టుబడిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: పేకాట స్థావరంపై దాడి చేసి రూ.23,210 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మామునూరు పోలీస్ స్టేషన్ పరిధి తిమ్మాపురం శివారులో రహస్యంగా పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. బుధవారం మధ్యాహ్నం మామునూరు ఎస్సై కృష్ణవేణితో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారులు గ్రామశివారులోని పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో తిమ్మాపురం గ్రామానికి చెందిన పిట్టల నరేష్, కాటబోయిన నగేష్, నామిండ్ల ఎలిశా, మేకల వైకుంఠం, మాచర్ల ప్రసాద్, సాంబారి సత్యనారాయణ, పోశాల వెంకన్నల అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. పట్టుబడిన ఏడుగురిపై కేసు నమోదు చేసి కేసును ఎస్సై కృష్ణవేణికి అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధి కారులు ఓరుగంటి భానుప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ చేయకుండానే బీమా డబ్బులు

కాశిబుగ్గ: వరంగల్‌లోని ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎలాంటి ఆపరేషన్ చేయకుండానే బీమా డబ్బులు క్లైయిమ్ చేశారని బాధితుడు అల్లి రాజేష్ బుధవారం ఆరోపించారు. కాశిబుగ్గ వివేకానంద కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అల్లి రాజేశ్ కిడ్నీ సమస్య అని వెంకట్రామ జంక్షన్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శనివారం చికిత్స నిమిత్తం అడ్మిట్ అయ్యాడు. గత నాలుగు రోజులుగా ఎండోస్కోపీ ద్వారా ట్రీట్మెంట్ చేస్తూ మూడు వారాల తర్వాత ఆపరేషన్ చేయాలని బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఇంటికి వెళ్లిన రాజేశ్‌కు తన ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.77వేలు క్లైయిమ్ అయినట్లు ఎస్ఎంఎస్ వచ్చిందని తెలిపారు. ఎస్ఎంఎస్ రావడంతో తనకు ఎలాంటి ఆపరేషన్ చేయకుండా ఇన్సూరెన్స్ ఎలా క్లైయిమ్ చేశారంటూ ఆస్పత్రి యాజ మాన్యాన్ని నిలదీస్తే వారం రోజుల పాటు ఓటి థియేటర్‌లో పెట్టి ఎండోస్కోపీ చేయడంతో పాటు ఒక అనస్థీషియా డాక్టర్‌తో ట్రీట్‌మెంట్ చేసినందుకు రూ.64 వేలు అయ్యిందని యాజమాన్యం తనకు బిల్లులు చూపెట్టినట్లు బాధితుడు తెలిపాడు. ఆస్పత్రిలో తనకు ఎలాంటి చికిత్స చేయకుండా బిల్లులు క్లైయిమ్ చేసిన ఆస్పత్రిపై వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు రాజేష్ కోరారు. ఈ విషయంపై ఆసుపత్రి యాజమాన్యం వద్ద వివరణ తీసుకోవడానికి ప్రయత్నించగా స్పందించలేదు.

శ్రీశరణ్యలో అరుదైన శస్త్రచికిత్స

నయీంనగర్: ప్రమాదవశాత్తు ఓ మహిళ కుడి చేయి గ్రైండర్‌లో ఇరుక్కుపోయి మణికట్టు కింది భాగం విరిగి రక్తనాళాలు దెబ్బతిని చేయికి రక్తసరఫరా నిలిచిపోయింది. చికిత్స కోసం బుధవారం హనుమకొండకు చెందిన లక్ష్మి నయీంనగర్‌లోని శ్రీ శరణ్య ఆస్పత్రికి వెళ్లగా పరీక్షించి వైద్యపరీక్షలు చేసి సుమారు ఆరు గంటల పాటు శ్రమించి అరుదైన శస్త్రచికిత్స చేసి రక్తప్రసరణ పునరుద్ధరించినట్లు వైద్యులు డాక్టర్ ప్రశాంత, డాక్టర్ నాగార్జున రెడ్డి, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ మఠం ఉపేందర్, డాక్టర్ తిరుపతిరెడ్డి ఆర్థోపెడిక్, డాక్టర్ రాజేందర్ తెలి పారు. ఈ సందర్భంగా డాక్టర్లకు, ఆసుపత్రి సిబ్బందికి రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆస్పత్రి 19 వార్షికోత్సవం సందర్భంగా ఉచితవైద్య శిబిరం నిర్వహించి రోగులకు పండ్లు, కోడిగుడ్లు పంపిణీ చేశారు.



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంత

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బోరు మోటార్ బిగింపుతో పాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా స్థానిక మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ తో కలిసి సీఐ మల్లయ్య ప్రారంభించి మాట్లాడారు. స్టేషన్ ప్రాంగణం మంతా గ్రీనరీతో పాటు ఫిర్యాదుదారులకు ఆహ్లాదకరంగా చక్కటి వాతావరణం కల్పించేందుకు పనులు చేపట్టామని తెలిపారు. ఎస్సైలు సురేష్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు

పోచమ్మకు బంగారు ముక్కుపుడక బహూకరణ



మామునూరు : వరంగల్ 43వ డివిజన్ శ్రీసత్యసాయినగర్‌లోని పోచమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు గుండాల చరణ్‌కుమార్, రాగిణి దంపతులు పోచమ్మ తల్లికి రూ.25వేల విలువైన బంగారు ముక్కుపుడక బహూకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధి శ్రీనివాస్ గుప్తా ముక్కుపుడక బహూకరించిన దాతలకు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత లక్ష్మీ, రేచర్ల తదితరులు పాల్గొన్నారు

కట్టమైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన

ఖిలా వరంగల్ : వరంగల్ విద్యానగర్‌లోని కాశికుంటలో బుధవారం కట్టమైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణ కమిటీ కావేటి శంకర్, ట్రాన్స్‌జెండర్ సవరం రంజిత, అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండుతులు జాగుర్లపూడి కోటయ్య శ ర్మ నేతృత్వంలో వేదమంత్రోచ్చరణల మధ్య వి గ్రహ పునఃప్రతిష్ఠాపన కన్నుల పండువగా నిర్వహించారు. మహన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వృద్ధులకు సన్మానం

రామన్నపేట : జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ ఆధ్వర్యంలో రామన్నపేటకు చెందిన గుండు సరోజన, బ్రహ్మదేవుల శివలింగంలను ట్రస్ట్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ బుధవారం శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.

తనిష్క్‌లో వయోవృద్ధుల దినోత్సవం

హన్మకొండ: హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని వజ్రాభరణాల స్టోర్ తనిష్క్‌లో బుధవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. తనిష్క్ ఫ్రాంచైజీ యశోద నారాయణరావు మాట్లాడుతూ ఒకప్పటి యువతే నేటి సీనియర్ సిటిజన్లు అన్నారు.

విద్యార్థులు చక్కటి విద్యనభ్యసించాలి

కాజీపేట: విద్యార్థులు విధిగా తల్లిదండ్రుల సలహాలు, సూచనలు పాటిస్తూ చక్కటి విద్యను అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత స్థాయిలోకి ఎదగడానికి కృషి చేయాలని వరంగల్ సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా అన్నారు. 62వ డివిజన్ సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

హుందాగా వ్యవహరించాలి

న్యూశాయంపేట : సమాజంలో పోలీస్ వ్యవస్థ హుందాగా వ్యవహరించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం వరంగల్ నగరంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో వరంగల్ ఏసీపీ మంత్రిని పొగుడ్తూ తన వృత్తి ధర్మాన్ని మరిచారన్నారు. ఈ విషయంపై సీపీ విచారణ జరిపి ఏసీపీపై చర్యలు తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర డీజీపీకి బీజేపీ తరఫున ఫిర్యాదు చేస్తామని అన్నారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కాజీపేట రూరల్ : సమాజంలో మహిళలు, వితంతువులు, యువతులు, విద్యార్థినులు సఖి సెంటర్ కేంద్రంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సఖి కేస్ వర్కర్ వి.వినీల అన్నారు. కాజీపేట దర్గా గాంధీనగర్‌లో బుధవారం ఆర్పీ నాగరాణి ఆధ్వర్యంలో మహిళలకు సఖి అవగాహన సదస్సు జరిగింది.

సికింద్రాబాద్‌కు తరలిన మహిళా కార్మికులు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల కో–ఆర్డినేటర్ నాయిని సదానందం ఆధ్వర్యంలో కాజీపేట మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల నుంచి మహిళా కార్మికులు బుధవారం సికింద్రాబాద్‌కు తరలివెళ్లారు. మహిళలపై అత్యాచారాలు ఖండిస్తూ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో రైల్వే జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన ర్యాలీ, నిరసన కార్యక్రమానికి బస్సులో తరలివెళ్లినట్లు కాజీపేట డీజిల్ బ్రాంచీ అధ్యక్షుడు ఎస్.కె.జానిమియా తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ముంపు ప్రాంతాలపై మున్సిపల్ అధికారిని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అభివృద్ధిని విస్మరించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని 4వ డివిజన్‌లో బుధవారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్‌లో ముంపు ప్రభావిత ప్రాంతాల గురించి అధికారులను, కాలనీలో స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలతో ముంపునకు గురయ్యే ప్రజలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చేపట్టి సమస్య లేకుండా చూస్తానని భరోసా కల్పించారు. అనంతరం జ్యోతిబసునగర్ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. స్థానిక కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు బోడ డిన్నా, వీరగంటి రవీందర్, చీకటి ఆనంద్, అజీజ్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు రాజు, శ్రీధర్‌యాదవ్, సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

హన్మకొండ: హనుమకొండ కృష్ణా కాలనీలో ఏర్పాటు చేసిన 57వ డివిజన్ కాంగ్రెస్ కార్యాలయాన్ని బుధవారం ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యాలయంలో నాయిని పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం రిజిష్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, అశోక్ రెడ్డి, రాంరెడ్డి, జయపాల్‌రెడ్డి, వెంకటమల్లు, లక్ష్మణ్, సతీష్, యాదగిరి, లలిత, బాగ్యలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా పోచమ్మ బోనాలు



వరంగల్ : డాక్టర్స్ కాలనీలో పోచమ్మ బోనాలతో మహిళలు

కాజీపేట/హన్మకొండ చౌరస్తా : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పార్క్‌లో, హనుమకొండలోని 10వ డివిజన్ రాయపురలో బుధవారం కాలనీవాసులు పోచమ్మకు బోనాలు చేశారు. స్థానిక మహిళలు బోనమెత్తి ఆటపాటలు, డప్పుచప్పుళ్లతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లుకు ఆయన మాట్లాడుతూ ఆలయానికి రూ. 5 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ రామలింగం, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ కాలనీలో..

దేశాయిపేట: నగరంలోని డాక్టర్స్ కాలనీ 2, అనుబంధ కాలనీలలో పోచమ్మ బోనాల ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షులు కొంతం సంగీత్, ఉపాధ్యక్షులు వేణు, రమేష్, సతీష్, చంద్రశేఖర్, రవీందర్, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి : నగరంలోని ఎల్లాపురంలో శ్రావణ మాసబోనాల ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం సభ్యులు వెలిశోజు రాజన్న బుచ్చయ్య, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

మడికొండ: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న పోచమ్మ తల్లి ఆలయంలో ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం అమ్మవారికి కుమ్మరులు మొదటి బోనం సమర్పించారు.

నష్కల్-హసన్‌పర్తి బైపాస్ రైల్వేలైన్ మార్చాలి

కాజీపేట రూరల్ : హనుమకొండలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజును పలు గ్రామాల రైతులు కలిశారు. నష్కల్ నుంచి హసన్‌పర్తి బైపాస్ రైల్వే లైన్ అలైన్‌మెంట్ విషయంలో దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను ఇటీవల కలిసి రైల్వే లైన్‌తో ఆ ప్రాంత రైతులు నష్టపోతున్నారని ప్రస్తావించినందుకు ఎంపీ కడియం కావ్య, శ్రీహరికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నష్కల్ నుంచి హసన్‌పర్తి రైల్వే బైపాస్ లైన్ నిర్మాణ ప్రతిపాదనలు మార్చాలని ఎమ్మెల్యే నాగరాజును కలిసి కోరగా అందుకు సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వివరించి రైతులకు న్యాయం చేయాలని కోరినట్లు చెప్పారని రైతులు తెలిపారు. సాగు భూములను ఎట్టి పరిస్థితులలో రైల్వే లైన్‌కోసం ఇవ్వమని పెద్దపెండ్యాల, రాంపూర్, నర్సింహులపల్లి, ఎల్కుర్తి, ధర్మసాగర్, ఉనికిచర్ల, మునిపల్లి, చింతగట్టు గ్రామాలకు చెందిన దాదాపు 40 మంది బాధిత రైతులు తమకు అండగా ఉండాలని ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం అందజేసి కోరినట్లు రైతులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఇంజనీరింగ్ విద్యతోనే ఉజ్వల భవిష్యత్

మామునూరు : విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యపాటు ఇంగ్లిష్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకుంటే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ సీహెచ్.దేవేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం బొల్లికుంటలోని వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ కే.ప్రకాశ్, డాక్టర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్ అధ్యక్షతన జరిగి సమావేశంలో నూతన ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు దిశానిర్దేశం, ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

వరంగల్ అర్బన్ : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నెలకొన్న అభివృద్ధి పనులు, సమస్యలపై దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు పలువురు కార్పొరేటర్లు విజ్ఞప్తి చేశారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ జారీ చేసిన సిఫారసులను కమిషనర్‌కు కార్పొరేటర్లు పుర్కాన్, పోశాల పద్మ, బస్వరాజు కుమారస్వామి, సురేష్ జోషి, బాబు, ప్రవీణ్, సురేష్, కాంగ్రెస్ నాయకులు ముష్కమళ్ల సుధాకర్, ఓని భాస్కర్‌లు కలిసి మంత్రికి వినతిపత్రాన్ని అందచేశారు.

కోటలో పశువైద్య శిబిరం

ఖిలావరంగల్ : తూర్పు కోటలోని పశువైద్యశాలలో పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, కేవీకే కోఆర్డినేటర్ రాజన్న హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువుల్లో ఎద లక్షణాలు గమనించాలన్నారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

కాజీపేట అర్బన్ : వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన నార్లగిరి మధుసూదన్(50) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల సిబ్బంది మధుసూదన్ మృతికి సంతాపం తెలిపారు.

ఎస్టీ సెల్ గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి..

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్ మడికొండకు చెందిన హనుమకొండ ఎస్టీ సెల్ గిరిజనమోర్చా హనుమకొండ జిల్లా కార్యదర్శి దారావత్ సునిల్ (50) గుండెపోటుతో మృతి చెందాడు. వెంకట్‌రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేందర్, రావు పద్మ, ప్రభాకర్, ఆకుల శ్రీకాంత్ పూల మాల వేసి నివాళులర్పించారు.

వర్గీకరణ అమలు చేస్తామని చెప్పడం మాలలను విస్మరించడమే



హన్మకొండ: గత ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇస్తే మాల మహానాడు, దళిత సంఘాలు బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డి కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకువస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఇది మాలలను విస్మరించడమేనని మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు అన్నారు.ఈ నెల 1న సుప్రీంకోర్టు ఎస్సీల రిజర్వేషన్‌ను రాష్ట్రాలకు అనుగుణంగా వర్గీకరించుకోవచ్చని తీర్పు చెప్పడానికి నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా బుధవారం మాల మహానాడు, అంబేడ్కర్ యు వజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

26న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

హన్మకొండ: హనుమకొండ 100 అడుగుల రోడ్డు వెంకటేశ్వర కాలనీలో ఈ నెల 26 నుంచి 30 వరకు శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక జమ్మికుంట కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.వెంకటాచార్యులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య, క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయినిని వెంకటచార్యులు కలిసి ఆహ్వాన పత్రికను అందించి వేడుకకు రావాలని ఆహ్వానించారు.

బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సోమేశ్వర్‌వర్మ

రామన్నపేట : బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా 24వ డివిజన్ మట్టెవాడకు చెందిన సిలుసాని సోమేశ్వర్‌వర్మ రెండోసారి ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో మరోసారి ఈ బాధ్యతను అందించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భారత్ బంద్ విజయవంతం

మడికొండ: మడికొండలో భారత్ బంద్ విజయవంతంగా ముగిసింది. ఉదయం విద్యాసంస్థలను మూసివేయించి వేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద వార్డు సభ్యులు నిరసన తెలిపారు.

బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవి

కాజీపేట: బీజేపీ హనుమకొండ జిల్లా ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుగులోతు రవిని నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.